క్లుప్తంగా

భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం



ఉప్పునుంతల: మండలంలోని మర్రిపల్లి ఆలయ ఆవరణలో శనివారం విష్ణు సహస్ర నామ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ బంధం బాల్‌నారాయణ మాట్లాడారు. పంచమవేదంగా ప్రసిద్ధిచెందిన మహాభారతం ప్రశస్తికి కారణమైన ఘట్టాలు, సన్నివేశాల్లో అత్యంత ముఖ్యమైనవి భీష్మ పర్వంలోని భగవద్గీత, అనుశాసనిక పర్వంలోని విష్ణుసహస్రనామమని తెలిపారు. భగవద్గీత భగవంతుని విశ్వరూపాన్ని ప్రదర్శిస్తే, సహస్రనామం ఆ విశ్వరూపుని గుణగణాలను వెయ్యినామాలతో పవిత్రంగా ప్రతిధ్వనిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్ రావు, గ్రామస్తులు రామచంద్రయ్య, శ్రీనివాసులు, వెంకటరమణ తదితరులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సమ్మర్ క్యాంపు ప్రారంభం



లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలలో 15 రోజుల పాటు నిర్వహించే వేసవి శిక్షణా తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ మాట్లాడారు. క్యాంపులో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన 7 గురుకుల పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. వీరికి శిక్షణ తీసుకున్న నలుగురు శిక్షకులు వివిధ అంశాలను బోధించడం, అవగాహన కల్పించడం నిర్వహిస్తారని తెలిపారు. క్యాంపులో వేదిక మ్యాథ్స్, వెస్ట్రన్ డ్యాన్స్, ఆర్ట్ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారని చెప్పారు. విద్యార్థులు శిక్షణ తరగతులను పూర్తి స్థాయిలో అవగాహన కల్పించుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, కోచ్‌లు, శిక్షణ తీసుకునే విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గురుకుల ఐదో తరగతి ప్రవేశ పరీక్ష

అచ్చంపేట రూరల్/వెల్దండ/ లింగాల/ కొల్లాపూర్ రూరల్: గురుకుల అయిదో తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న తెలిపారు. శనివారం పట్టణ సమీపంలోని గురుకుల పాఠశాల, కళాశాలలో ఆమె విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షకు హాజరుకావాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు సెంటర్‌కు గంట ముందుగానే రావాలన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

తాడూరు: బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండనాగేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా గ్రామాల కార్యకర్తలతో బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బూత్ స్థాయిలో ఎంపికైన కమిటీ సభ్యులంతా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటనారాయణ, లోహిత్‌రెడ్డి, రాజు, సాంబశివుడు, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

అచ్చంపేట రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైందని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిద్దాపూర్ ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. ఈ నెల 21న శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన బాలిక బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

రేపు ఉప్పునుంతలలో సీపీఆర్‌పై శిక్షణ

ఉప్పునుంతల: రైతు వేదిక వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు గుండెపోటు మరణం నుంచి కాపాడుకోవడానికి సీపీఆర్(లైఫ్ సేవింగ్ టెక్నిక్)పై శిక్షణ ఇవ్వనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వప్న శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్, వైద్యబృందం శిక్షణ ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.



అచ్చంపేటలో శుభాకాంక్షలు చెబుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు



కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



కల్వకుర్తిలో ముస్లిం మతపెద్దలతో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



కొల్లాపూర్‌లో ముస్లింలతో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

ఘనంగా రంజాన్ వేడుకలు



తాడూరు మండలం యాదిరెడ్డిపల్లిలో ప్రార్థనలు



మన్ననూర్‌లో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



కొల్లాపూర్ మండలం చుక్కాయిపల్లిలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వెల్దండలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లోని ముస్లింలు శుక్రవారం రాత్రి నెలవంక కనిపించడంతో శనివారం రంజాన్‌ను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. నెలరోజుల ఉపవాస దీక్షలను ఆచరించి ముగించారు. ఈద్గాల వద్దకు ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాస దీక్షలను విరమించారు. ఈద్గా సమీపంలోని తమ పూర్వికుల సమాధుల వద్ద కూడా ప్రార్థనలు చేశారు. రంజాన్ రోజున ముస్లింలు దాన, ధర్మాలు చేశారు. ఆ తర్వాత వివిధ పార్టీల నాయకులు ముస్లింలను ఆలింగనం చేసుకుని వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

■ అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు పోకల మనోహర్, మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహ్మగౌడ్, మాజీ చైర్మన్ కె.తులసీరాం, మాజీ మార్కెట్ చైర్మన్ వై.శ్రీనివాసులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నేతలు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, రంగినేని అభిలాష్‌రావు, జగదీశ్వరుడు, రాముయాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగిడాల శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు నాయకులు ఈద్గా వద్దకు చేరుకుని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

■ నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తిలో రాష్ట్ర డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీపీ నర్సింహా రెడ్డి తదితరులు ఈద్గాల వద్దకు చేరుకుని ముస్లిం ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

■ బల్మూర్ మండలంలోని కొండనాగులలో ప్రభుత్వ విప్, గువ్వల బాలరాజు, గోదల్‌లో డీసీసీ అధ్యక్షుడు డా.వంశీకృష్ణ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

■ కల్వకుర్తి ఈద్గాల వద్ద ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే వంశీచందర్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

– 'సాక్షి' నెట్‌వర్క్



బిజినేపల్లిలో పీర్లగుట్ట వద్ద ప్రార్థనలు



బల్మూర్‌లోని గోదల్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ



జటప్రోల్‌లో చిన్నారులు



ఉప్పునుంతలలో..



లింగాలలో..



అమ్రాబాద్‌లో..



తెలకపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చారకొండ మండలం జూపల్లిలో



కోడేరులో శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్ వెంకటస్వామి



ఊర్కొండ మసీదుకు ర్యాలీగా వెళ్తున్న ముస్లిం సోదరులు



కల్వకుర్తిలో శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వంశీ చందర్‌రెడ్డి



నాగర్‌కర్నూల్‌లో శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఎస్పీ నాయకులు



యాపట్ల దర్గావద్ద సమాజ్ అనంతరం మత పెద్ద బోధనలు వింటున్న ముస్లింలు

సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష

వెల్దండ: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం వెల్దండలో విలేకరులతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొంది మూడోసారి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 25న రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ సమావేశానికి నియోజకవర్గం నుంచి అన్ని మండలాల నాయకులు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు జయప్రకాష్, కాడురామ్ నాయక్, వెంకటయ్య, మల్లయ్య, వెంకటేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రసాయనశాస్త్రంలో ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్




కందనూలు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మహిళ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న జిల్లా కేంద్రానికి చెందిన ఎమ్. ప్రవీణ్ కుమార్‌కు రసాయన శాస్త్రంలో డాక్టరేట్ లభించింది. రసాయన శాస్త్ర విభాగంలో ఎకో ఫ్రెండ్లీ సింథసిస్ ఆఫ్ సిల్వర్ నానోపార్టికల్స్ క్యారెక్టరైజేషన్ అండ్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసినందుకు గాను రాజస్థాన్‌లోని ఓపీజేయస్ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో ప్రవీణ్ కుమార్‌కు డాక్టరేట్ పట్టాను అందించారు.

రత్నప్రభాకర్‌రెడ్డి సేవలు మరువలేనివి

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ నాయకులు రత్నప్రభాకర్‌రెడ్డి సేవలు మరువలేనివని బీసీ ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసులు అన్నారు. శనివారం రత్నప్రభాకర్‌రెడ్డి స్మారకార్థం పట్టణంలో అంబలి కేంద్రం ఏర్పాటు చేసి అందజేశారు. ప్రజా సేవలో రత్నప్రభాకర్‌రెడ్డి రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని కొనియాడారు.

25న నిరుద్యోగ మార్చ్



కొల్లాపూర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. ఈ నెల 25 ఉమ్మడి జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరుద్యోగ మార్చ్ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు వెల్లడించారు. నిరుద్యోగ మార్చ్ పోస్టర్లను శనివారం కొల్లాపూర్‌లో ఆవిష్కరించారు. నిరుద్యోగ మార్చ్‌కు విద్యావంతులు తరలిరావాలని కోరారు. ధనుంజయ్‌గౌడ్, కద్దాల కృష్ణ, శేఖర్‌రావు, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బలగం సినిమా తిలకించిన ఎమ్మెల్యే మర్రి



సినిమా తిలకిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: తిమ్మాజిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మండల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి శనివారం రాత్రి బలగం సినిమా తిలకించారు. అంతకు ముందు మండలంలోని పుల్లగిరిలో బొడ్రాయి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మల్లేశ్వరంలో సినిమా ప్రదర్శన

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరంలో గ్రామ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో బలగం సినిమాను ప్రదర్శించారు. ఆ సినిమాను చూడటానికి గ్రామంలో ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. పల్లెల్లో ఉండే కట్టుబాట్లు, సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ సభ్యుల మధ్య ఉండే ఆప్యాయతలు కలిగి ఉన్న సినిమా కావడంతో గ్రామంలో ప్రదర్శించారు. యువకులు నర్సింహనాయుడు, డిష్‌రవి, రాజు, రాము, శేకర్, రామకృష్ణ, సుధాకర్ సినిమా ప్రదర్శనకు సహకరించారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బల్మూర్: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట దళారుల చేతికి అందరాదనే ఆశయంతో వారికి ప్రభుత్వం మద్దతు ధరతో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని కొండనాగుల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా తమ పంటలను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి క్వింటాల్‌కు రూ.2,060 మద్దతు పొందాలని సూచించారు. ఎంపీపీ వేనేపల్లి అరుణ, విండో చైర్మన్ నర్సయ్య, కుర్మయ్య, రేవతి, సుభద్ర, రవిచంద్రరెడ్డి, అంజనమ్మ పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించండి

కొల్లాపూర్: వీఓఏల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు.

జూపల్లి సంఘీభావం..

వీఓఏలు చేపట్టిన నిరసన దీక్షలకు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సంఘీభావం ప్రకటించారు. శనివారం ఆయన దీక్షా శిబిరాన్ని సందర్శించారు.

వెల్దండ: మండల కేంద్రం బస్‌స్టాండ్ ఆవరణలో వీఓఏల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రమదోపిడీ చేస్తుందన్నారు.

తెలకపల్లి: అయిదు రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వీఓఏల జిల్లా అధ్యక్షుడు మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

పెద్దకొత్తపల్లి: వీఓఏల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని పెద్దకొత్తపల్లి వీఓఏ మండల అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు.



తెలకపల్లిలో సమ్మెలో మాట్లాడుతున్న మల్లేష్

భర్త వేధింపులపై కేసు నమోదు

వెల్దండ: మండల పరిధిలోని తిమ్మినోనిపల్లికి చెందిన మోటమోని సుమలతను అదనపు కట్నం కోసం భర్తతో పాటు కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని శనివారం వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మినోనిపల్లికి చెందిన సుమలత సిద్ధపేటకు చెందిన నీల కర్ణాకర్ ప్రేమించుకున్నారు. వీరు 2021 సంవత్సరంలో వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు ఉన్నారు. ఇటీవల భర్త కర్ణాకర్‌తో పాటు కుటుంబ సభ్యులు వేధించడంతో ఇటీవల సుమలత స్వగ్రామానికి తిరిగి వచ్చింది. పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించిన ఒప్పుకోకపోవడంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పిడుగుపాటుకు ఎద్దులు మృతి



తెలకపల్లి: పిడుగు పాటుకు గుర్రై రెండు కాడెద్దులు మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఉరుము, మెరుపులు, గాలితో కూడిన వర్షం కురిసింది. దీంతో పాటు ఒక్కసారిగా పిడుగు పడటంతో ఎద్దులు మృతిచెందాయి. మండల పరిధిలోని రాకొండకి చెందిన అంకూరి రాములుకు చెందిన రెండు కాడెద్దులు తన పొలంలో కట్టేశాడు. తెల్లవారుజామున పిడుగు పడి మృతి చెందాయి. వాటి విలువ రూ.1.60లక్షలు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. రెండు కాడెద్దులు ఒకేసారి చనిపోవడంతో రైతు రాములు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. రోడ్డున పడ్డామని కన్నీరు మున్నీరయ్యారు.

టీచర్ల బదిలీలు చేపట్టాలి

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో టీచర్ల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ప్రస్తుత వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ కోరారు. శనివారం అచ్చంపేటలో డివిజన్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. చాలా ఏళ్లుగా బదిలీలు, ప్రమోషన్లు లేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెండింగ్‌లోని డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసులు, పెంట్యానాయక్, అరవింద్‌రావు, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

వీధినాటకాలకు సాయం

వెల్దండ: మండల పరిధిలోని లింగారెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న వీధినాటకాలకు కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం శనివారం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామంలో రెండు రోజులుగా ఆడపిల్ల అంజమ్మ వీధినాటకం ప్రదర్శిస్తున్నారు. సోమయ్య, రవి, లక్ష్మయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

వెల్దండ: మండల పరిధిలోని నారాయణపూర్‌లో సర్పంచ్ అంజినాయక్ శనివారం ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వేసవిలో కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు.

సర్పంచ్‌కు సన్మానం

అమ్రాబాద్: మండల కేంద్రం పదరలో మసీద్ అభివృద్ధి పనులను పదర సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ తన సొంత డబ్బులతో చేయించాడు. దీంతో రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలు సర్పంచ్‌కు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. రామలింగయ్య యాదవ్, వెంకటయ్య, అంజి, అయోధ్య, సత్యం పాల్గొన్నారు.



